క్లుప్తంగా

బీచ్‌రోడ్డులో మరమ్మతులు



నోవాటెల్ హోటల్ వద్ద రహదారిపై పనులు జరుగుతున్న ప్రాంతం

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులో నుంచి జిల్లా పరిషత్‌కు వెళ్లే మార్గంలో డ్రైనేజీ మార్గానికి పైన వేసే ఐరన్ గ్రిల్ దెబ్బ తినడంతో సిబ్బంది మరమ్మతులు ప్రారంభించారు. ఈ పనులు మరికొద్ది రోజులు కొనసాగే అవకాశం ఉంది. ఇప్పటికే ఇనుప పైకప్పును మార్చాలిన ప్రదేశాన్ని తవ్వి పై పొరను తొలగించారు. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనచోదకులు చూసుకుని వెళ్లాల్సిన అవసరం ఉంది. మరమ్మతులు జరుగుతున్న ప్రాంతం చుట్టూ ముందు జాగ్రత్తగా స్టాపర్లను ఏర్పాటు చేశారు. అయితే, రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలి.

విశాఖలో బీజేపీ బలోపేతానికి కృషి



పురందేశ్వరిని గజమాలతో సత్కరిస్తున్న సంతోష్ తదితరులు

ఎంవీపీకాలనీ: విశాఖలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, మత్స్యకార నాయకుడు వాసుపల్లి సంతోష్ కుమార్ అన్నారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. పార్టీ నాయకులతో కలిసి పురందేశ్వరి పార్టీ కండువా కప్పి ఆయన్ను ఆహ్వానించారు. అనంతరం ఆయన, అనుచరులతో కలిసి గజమాలతో పురందేశ్వరిని సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు పది వేల పెన్నులతో పూజ



అమ్మవారి సన్నిధిలో పది వేల పెన్నులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ద్వాదశి, మాఘ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. రానున్న పోటీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని, ఎర్నిమాంబ అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని దైవ సన్నిధిలో దశ సహస్ర (10 వేలు) కలములతో విశేష పూజలు నిర్వహించినట్లు ఈవో సురేష్‌బాబు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అమ్మవారి పేరుతో ముద్రించిన పెన్నులు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రత్యేక ఉచిత దర్శనాలకు అనుమతించారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం

సీతంపేట : సమాజంలో కుల మతోన్మాదానికి వ్యతిరేకంగా డాక్టర్ జయగోపాల్ ఉద్యమించడమే కాకుండా అనేక రచనలు చేశారని ఉదయ భాస్కర్ అన్నారు. ప్రముఖ నాస్తికోద్యమనేత పెరియార్ అవార్డు గ్రహీత డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి సభ భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయగోపాల్ పుస్తకాలతోపాటు సీవీ రచనలను కూడా ప్రమోట్ చేసేవారని గుర్తు చేశారు. జయగోపాల్ ఆశయ సాధనకు ఆయన సతీమణి శారద సహకారం అందించి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ మూఢ నమ్మకాల పట్ల ప్రజలను జాగృతం చెయ్యడంలో జయగోపాల్ పోషించిన పాత్ర అనిర్వచనీయమన్నారు. ముందుగా జయగోపాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు రవి, సాయి నరేందర్, వేదాంత మౌర్య, వై.నూకరాజు, కొత్తపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రస్తావనలే.. పనుల్లేవు

రెండేళ్లవుతున్నా పట్టించుకోని అధికారులు



పూడికతో పూర్తిగా మూసుకుపోయిన నారోజీనగర్ గెడ్డ

- కౌన్సిల్‌కే పరిమితమవుతున్న సమస్యలు
- కార్యరూపం దాల్చని గెడ్డల ఆధునికీకరణ
- చెత్త పేరుకుపోవడంతో స్థానికుల అవస్థలు

గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమస్యలు కౌన్సిల్‌లో ప్రస్తావనకే పరిమితం అవుతున్నాయి. కౌన్సిల్‌లో కార్పొరేటర్లు తమ వార్డు సమస్యలు చెప్పి పరిష్కరించాలని చెబుతున్నా.. జీవీఎంసీ ఉన్నతాధికారులు మాత్రం వాటిపై దృష్టి సారించడం లేదు. దీంతో స్థానిక సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అధ్వానంగా ఉన్న పితానివానిపాలెం గెడ్డ

బీచ్‌రోడ్డు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో గెడ్డల ఆధునికీకరణ ఎంతో అవసరం. నగర అభివృద్ధికి తగ్గట్టుగా జనాభా కూడా పెద్ద సంఖ్యలో పెరగటంతో నివాస గృహాల సంఖ్య పెరిగింది. దీంతో గెడ్డల్లో చేరే వ్యర్థాలూ పెరిగాయి. అయితే ప్రస్తుతం ఉన్న జనసాంద్రతకు అనుగుణంగా గెడ్డలను ఆధునికీకరణ చేయకపోవడం వలన గెడ్డల్లో చెత్త పెద్ద మొత్తంలో పేరుకుపోతోంది.

జీవీఎంసీ 20వ వార్డులోని నారోజీనగర్, శివాజీపాలెం, 22వ వార్డులోని పితానివానిపాలెం, పిఠాపురం కాలనీలో పదికి పైగా గెడ్డలు ఉన్నాయి. అ గెడ్డల్లో భారీ మొత్తంలో చెత్త దర్శనమిస్తోంది. గెడ్డలోని పూడిక తొలగించకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి మురుగు ప్రవహించడం లేదు. దీంతో దుర్గంధంతో పాటు తరచూ అనారోగ్యంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

పెరుగుతున్న దోమల బెడద

గెడ్డలో చెత్త పేరుకుపోవడంతో దోమలు బెడద పెరుగుతోంది. దుర్గంధం, దోమలతో ఇంటి తలుపులు, కిటికీలు తీసే పరిస్థితి ఉండటం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గెడ్డల్లో పూడికలు తొలగించాలని కోరుతున్నారు. గెడ్డలను ఆధునికీకరించి తమకు అవస్థలు తప్పించాలని కోరుతున్నారు.

శిథిలమవుతున్న రక్షణ గోడలు

గెడ్డలోని నీరు ఇంట్లోకి రాకుండా ఉండేందుకు నిర్మించిన రక్షణ గోడలు శిథిలమవుతున్నాయి. ఏళ్ల కిందట నిర్మించిన రక్షణ గోడలు కావటం ..గెడ్డల్లో పూడిక సరిగ్గా తొలగించకపోవటంతో గోడలకు పగుళ్లు వస్తున్నాయి. ఏ క్షణంలో కూలిపోతాయో తెలియని పరిస్థితి. అవి కూలిపోతే తమ పరిస్థితి ఏమిటా అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు గతేడాది కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల గెడ్డలను దాటి మురుగు రోడ్డుపైకి ప్రవహించడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. మళ్లీ వర్షాకాలం వచ్చేలోపు గెడ్డలను ఆధునికీకరించాలని అధికారులను కోరుతున్నారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న శివాజీపాలెం గెడ్డ రక్షణ గోడలు



చెత్తతో నిండిపోయిన పిఠాపురం కాలనీ గెడ్డ



కౌన్సిల్‌లో చర్చించినా..

మా వార్డు పరిధిలో గెడ్డలను ఆధునికీకరించాలని రెండేళ్ల నుంచి ప్రతీ కౌన్సిల్‌లో ప్రస్తావిస్తున్నాను. కౌన్సిల్‌లో అధికారులు ఆధునీకరిస్తామని చెబుతున్నారు, కానీ ఆ మాటలు కౌన్సిల్‌కే పరిమితం అవుతున్నాయి. గెడ్డలు శిథిలావస్థలో ఉండడంతో వార్డు ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో వారి అవస్థలు వర్ణనాతీతం. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

– ముప్పల లక్ష్మి, కార్పొరేటర్, 20వ వార్డు

వైభవంగా ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



చక్రస్నానంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. పూర్ణాహుతి, ఉత్సవులకు తిరుమంజన సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సాగరతీరాన శ్రీచక్రపెరుమాళ్‌తో కలిసి అర్చకులు, భక్తులు శాస్త్రోక్తంగా చక్రస్నాన కార్యక్రమాలు శోభాయమానంగా జరిపించారు. సాయంత్రం ద్వాదశ ఆరాధనలు, శ్రీ పుష్పయాగం, సప్తావరణలు, దేవతోద్వాసన, కుంభప్రోక్షణ, ఋత్విక్‌సన్మానం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా జరిగిన వేడుకల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దుర్గారావు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని బంగారమ్మ మెట్ట వద్ద గల బంగారమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు అమ్మవారిని దర్శించుకుని, పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ ఈగల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

- కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ
- పార్కింగ్ కారణంగా మళ్లీ ఇరుకుగానే రోడ్లు
- వాహనచోదకులకు తప్పని అవస్థలు





చినగదిలి సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ రోడ్డులో నిలిపిన కార్లు, వ్యానులు, ఆటోలు

ఆరిలోవ: రహదారులు పార్కింగ్ జోన్లుగా మారుతున్నాయి. కోట్ల రూపాయలు ప్రజా ధనం ఖర్చు చేసి నిర్మించిన రోడ్లను కొందరు పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. ప్రజల రాకపోకలకు సౌలభ్యంగా రహదారులను విస్తరించినా.. వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేయడంతో ఫలితం లేకుండా పోతోంది.

జీవీఎంసీ 12వ వార్డు పరిధి చినగదిలిలో బీఆర్‌టీఎస్ కూడలి వద్ద నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజా నగర్ వరకు 20 అడుగుల ఇరుకు రోడ్డు ఉండేది. ఆరిలోవ, శ్రీకాంత్‌నగర్ ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనచోదకులకు ఇది అసౌకర్యంగా ఉండేది. దీంతో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి సూచనలతో ఈ జీవీఎంసీ అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ 2.35 కోట్లతో ఈ రోడ్డును 60 నుంచి 80 అడుగులు డబుల్ రోడ్డుగా విస్తరించారు. సెంట్రల్ లైటింగ్, ఇరుపక్కలా ఫుట్‌పాత్‌లతో అందంగా తయారు చేశారు. దీంతో ఏళ్ల తరబడి ఎదుర్కొన్న ట్రాఫిక్ సమస్యకు ఇక్కడ బ్రేక్ పడింది.

రోజుల తరబడి ఇక్కడే..

రూ.కోట్లతో నిర్మించిన ఈ రోడ్డుపై కొందరు కార్లు, లారీలు, అంబులెన్స్‌లు, చికెన్ షాపులకు కోళ్లు సరఫరా చేసే వ్యానులు, ట్రావెల్ బస్‌లు, ఆటోలు నిలిపేస్తున్నారు. ఇళ్ల వద్ద కారు నిలుపుకోవడానికి వీలు లేనివారు ఈ రోడ్డును పార్కింగ్ ప్లేస్‌గా వినియోగించుకుని వాహనచోదకులకు ఆటంకం కలిగిస్తున్నారు. కొన్ని వాహనాలను రోజుల తరబడి నిలిపేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయినప్పటి నుంచి ఇక్కడ ఇదే తీరుగా మారింది. ఈ రోడ్డుపై మళ్లీ ఇరుకు సమస్య మొదలైందని, రూ.కోట్లు ఖర్చుచేసినా ఫలితం లేకుండాపోయిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌ల పైకి వెళ్లడానికి ఈ వాహనాలు అడ్డంగా ఉంటున్నాయని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా దీన్ని పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇక్కడ పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని, వాహన రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

బీఆర్‌టీఎస్ కూడళ్లలో గజిబిజి



బీఆర్‌టీఎస్ చినగదిలి కూడలిలో గజిబిజిగా వాహనాలు

ఆరిలోవ: హనుమంతవాక నుంచి అడవివరం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో కూడళ్లు గజిబిజిగా మారుతున్నాయి. ఈ జంక్షన్లలో వాహనాలు ఎటు నుంచి ఎటు వైపు వెళతాయో తెలియని పరిస్థితి. బీఆర్‌టీఎస్‌లో పాత పందులఫారం (విమ్స్ గేటు ఎదురుగా), పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్‌కాలనీల వద్ద కూడళ్లు ఉన్నాయి. వాటిలో పాత పందులఫారం, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వద్ద కూడళ్లు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటాయి. ఐదు లేన్ల రోడ్డు కావడంతో ఆయా కూడళ్లలో ఏ లేన్‌లో ఏ వాహనాలు వస్తుంటాయో గమనించలేకపోతున్నారు. వీటి వద్ద ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ పనిచేయడం లేదు. ట్రాఫిక్ పోలీసులు కూడా అందుబాటులో ఉండటంలేదు. కొందరు వాహనచోదకులు ఇష్టానుసారంగా ఈ కూడళ్లలో ప్రయాణిస్తున్నారు. వారిని గమనిస్తూ రోడ్డు దాటడానికి పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వస్తున్న విద్యార్థులకు ఆయా కూడళ్ల వద్ద రోడ్డు దాటడం పెద్ద పరీక్షే. ఉదయం, సాయంత్రం సమయాలలో పాఠశాలలు, కళాశాలల బస్‌ల కోసం విద్యార్థులు ఈ కూడళ్లు దాటాల్సి వస్తోంది. వాహనాల గజిబిజిలో ఈ జంక్షన్ల వద్ద దాటడానికి వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ కూడళ్ల వద్ద నిత్యం ట్రాఫిక్ పోలీసులను అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ పని చేసేలా చూడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

నిరుపయోగంగా నీగ్రో హిప్పో ఎన్‌క్లోజర్



జూ పార్కులో నీగ్రో హిప్పో ఎన్‌క్లోజర్



శిథిలమైన నీగ్రో హిప్పో నైట్‌క్రాల్

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో నీగ్రో హిప్పోపొటమస్ ఎన్‌క్లోజర్ నిరుపయోగంగా మిగిలింది. ఇక్కడ లేని ఈ జాతి జంతువులను ఇతర జూ పార్కులు నుంచి తీసుకురావడానికి 2013లో జూ అధికారులు సన్నాహాలు చేశారు. వీటి కోసం జూలో నీటి ఏనుగులు ఎన్‌క్లోజర్ పక్కన కొత్తగా నీగ్రో హిప్పోలకు అనుకూలంగా కొత్తగా ఎన్‌క్లోజర్ నిర్మించారు. సందర్శకుల కోసం విడిచిపెట్టడానికి డే క్రాల్‌తో పాటు అవి రాత్రుల విశ్రాంతి తీసుకోవడం కోసం నైట్‌క్రాల్‌ను నిర్మించారు. ఎన్‌క్లోజర్ నిర్మించిన అనంతరం వాటిని తీసుకువచ్చే ప్రతిపాదన నిలిచిపోయింది. దీంతో కొన్ని రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఈ ఎన్‌క్లోజర్ నిరుపయోగంగా మారింది. దీంతో పాటు వాటి కోసం నిర్మించిన నైట్‌క్రాల్ శిథిలమైంది. ఇక్కడ లేని అరుదైన ఈ జాతి నీగ్రో హిప్పోలను విశాఖ జూ పార్కుకు తీసుకురావాలని సందర్శకులు అధికారులను కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

సీతంపేట : శ్రీలలితాపీఠం 76వ బ్రహ్మోత్సవాలు అంకురార్పరణతో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి సమక్షంలో కుర్తాళం పీఠం పురోహితులు మాచవోలు రమేష్ శర్మ వేదమంత్రాల మధ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి లలితా కామేశ్వరులకు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు చేపడతామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అలాగే సాయంత్రం 6:30 గంటలకు లలితా కామేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐ.సుబ్బరామనాయుడు, యశోదమ్మ, భక్తులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌ను ముక్కలు చేయడం సరికాదు

పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు

మద్దిలపాలెం: విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం వాల్తేరు డివిజన్‌ను ముక్కలు చేయడం సరికాదని పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు అన్నారు. ఇన్నాళ్లకు ఉత్తరాంధ్ర ప్రజల కలను నెరవేర్చిన ఎన్డీఏ ప్రభుత్వం కేకే లైన్, అరకు మార్గం సహా పాత వాల్తేరు డివిజన్ మొత్తాన్ని, విశాఖ కేంద్రంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌లోనే కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ బోర్డును విశాఖలోనే ఏర్పాటు చేయాలని, జోన్‌కు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కేకే లైన్, అరకు మార్గం లేని సౌత్ కోస్టల్ జోన్ వలన ఉత్తరాంధ్ర ప్రజల ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ప్రాధాన్యం గల కేకే లైన్‌ను విశాఖ నుంచి తొలగించి, రాయగడలో కలపడం విచారకరమని పేర్కొన్నారు. పెద్దగా ఆదాయం లేని విశాఖ రైల్వే జోన్‌లో ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం కూడా భవిష్యత్తులో కష్టంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే అరకును కూడా రాయగడ జోన్‌లో కలపడం ద్వారా ఏపీకి తీవ్ర నష్టం కలుగుతుందని, ఈ చర్యతో ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి, ఉపాధికి నష్టం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో గల ఎన్డీఏ ప్రభుత్వాలు పునరాలోచించి కేకే లైన్, అరకు రైలు మార్గాలను విశాఖ జోన్‌లో కొనసాగించాలని కోరారు.







సాయంకాలం.. సాగరతీరం



నగరంలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. వారంలో ఆరు రోజులు చదువులు, ఉద్యోగాలతో గడిపేసిన చిన్నా, పెద్ద రిఫ్రెష్‌మెంట్ కోసం ఆదివారం సాయంత్రం అలా.. అలల చెంతకు చేరారు. దీంతో బీచ్ రోడ్డులోని యుద్ధ విమాన మ్యూజియం, కురుసుర సబ్‌మెరైన్, కైలాసగిరి రోప్ వే, తెన్నేటిపార్క్‌లు సందర్శకులతో కిటకిటలాడాయి. ఎండ తీవ్రత సైతం మెల్లగా పెరుగుతున్న నేపథ్యంలో సాగర తీరంలో సేద తీరారు. కుటుంబ సభ్యులతో ఫొటోలు,సెల్ఫీలు తీసుకుంటూ సంతోషంగా గడిపారు.

– ఏయూక్యాంపస్

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం